పవిత్ర భారతదేశం పవిత్ర భారతీయ స్త్రీ మూర్తి అనగానేనాకు వళ్ళంతా తేళ్లూ జెర్రులూ ప్రాకినట్టు కంపరమెత్తిపోతుంది. ఇహలోకంలో ఏదేశమూ పవిత్రం కానట్టూ ఏ దేశంలోని స్త్రీలూ పవిత్రులు కానట్టూ కోసే కోతలు యీ దేశంలో యింకా ఎంతకాలం దేశభక్తిగా, చెలామణి అవుతాయో నాకర్థం కావటంలేదు. భారత ప్రభుత్వం తెలిసో తెలియకో ఫామిలీ ప్లానింగ్ ద్వారా "సెక్స్ ఫ్రీడం"ని బ్లాంక్ చెక్కులా స్త్రీలకు ప్రసాదించింది. పురుషుల దౌర్జన్యాలన్నిటికి సమాధానం చెప్పగల ఒక మహాస్త్రాన్ని గవర్నమెంటు స్త్రీలకు యిచ్చింది. రేపటి ప్రపంచంలో తనకు బిడ్డ అవసరమాకాదా అని నిర్ణయించుకునేది స్త్రీ. పెళ్ళి చేసుకోవటమా ఉద్యోగం చేయటమా అనినిర్ణయించుకునేది స్త్రీ. గర్భధారణమనే శాపాన్నుండి విముక్తి స్త్రీకి లభించినపుడు యిప్పటి వ్యవస్థా స్వరూపాల్ని తల క్రిందుగా చేయగల వజ్రాయుధం ఆవిడ చేతిలో వుంటుంది. ట్రెడిషనల్ కన్సర్వేటిజంతో కుంచించుకుపోయిన వైవాహిక వ్యవస్థపై వజ్రాయుధాన్ని ప్రయోగించగలదు రేపటి స్త్రీ. ఇప్పుడు "పలుకవేమి నాదైవమా" అంటున్నారు ఆడాళ్ళు. మరికొందరు "పిలిచిన బిగువటరా ఔరౌర!" అంటున్నారు. రేపటి స్త్రీ అలా అనదు. ఆవిడ చేతిలో గవర్మెంటా ఫిండియావారి బ్లాంక్ చెక్కుంది. టేక్కేర్!

# నదీనదీ గోస్తనదీ

అత్తిలి నుంచి అమెరికా వెళ్తే ఎలాగుంటుందో నా చిన్నప్పుడు మా వూర్నించి తణుకు బస్తీకి వెళ్ళినపుడు అలాగనిపించేది. తణుకు పేరు జ్ఞాపకం వచ్చినపుడల్లా నాకు గోస్తనది జ్ఞాపకం వస్తుంది. వంకర నడత కలవారిని అనేకమందిని మనం చూసి వుంటాం, కాని తణుకులో గోస్త నది వారందర్నీ మించిపోతుంది. ఎవరి దొడ్డిగుమ్మం తలుపుతీసినా గోస్తనదే నవ్వుతూ పలకరిస్తుంది. కాలవని నది అంటే ఎవరికైనా నవ్వొస్తుందా రాదా? గోస్తనదిని నది అనకుండా కాలవ అంటె తణుకులో ఎవరి కైనా యిట్టే కోపం రావచ్చు.

రేపు పావంచాలమీద కూర్చుని ఆ నీళ్లలో అలా పాదాలు ముంచగానే గోస్తనది కిలకిలా నవ్వుతూ మాతో కబుర్లు చెప్పడము ప్రారంభిస్తుంది. మాకు కంఠతా వచ్చిన పాటలన్నీ అక్కడే కూర్చుని పాడి గోస్తనదికి వినిపించే వాళ్ళం. మా ఆటలు, మా కబుర్లు, మా నవ్వులూ వింటూ మౌనంగా సాగిపోయే గోస్తనదిని ఎట్లా మర్చిపోవటం? గట్లను రాసుకుని కొత్తకాలువ పూటుగా వున్నపుడు దగ్గరకు వెళ్ళటానికే భయం వేసేది. వేసంకాలం కాలవలు కట్టేస్తారు కదా – అప్పుడు మోకాలి లోతునీళ్ళలో గెంతడం మాకు చెడ్డ సరదాగా వుండేది. పొద్దస్తమానం కాలవ లోనే నాన్తూ తేల్తూ వుండేవాళ్ళం.

ఎన్నాళ్ళకో కలుసుకున్న నేస్తాలకు, అక్క చెల్లెళ్ళకు కబుర్లు వూరి పోయినట్లుగా మా కందరికీ ఆ గోస్తనది గట్లమీద, మెట్లమీద ముచ్చట్లు వూరేవి. ఏం మాట్లాడుకున్నాం ఆ మాటలకు అర్థమేవిటని యిప్పుడు నన్నడక్కండి. ఆడపిల్లలు వయసొచ్చినా రాకపోయినా ఎన్నో వూసులాడుకుంటారు. ఒకళ్ళమీదొకళ్ళు పడి నవ్వుకుంటారు. నదిలోకి దిగినట్టే దిగి దోసిళ్ళతో నీళ్ళు మీద జల్లుకుంటారు. జడల ముడులు విప్పుకుని నదీమతల్లి గుండెలమీద పాయలు పాయలుగా విచ్చి నిన్నటి పుష్పాలను నదిలో విసిరివేస్తారు. అవును నిన్నటి పుష్పాలెవరికీ అక్కర్లేదు కదా! నిన్న ఈ చేత్తోనే దేవుడికి పూజ చేసిన పుష్పాలు యీ వేళ నదిలో కొట్టుకురావటం చూసినపుడు ఎన్నెన్నో వింత వింత భావాలు కలిగేవి. నది మీద పసుపూ కుంకుమచ్ఛాయలను పరుచుకుంటూ ఆ పూవులలా కదుల్తూ ప్రయాణం చేస్తూంటే ఒక గొప్ప జీవిత రహస్యాన్ని అవి మనకు చెప్పటములేదుకదా అనిపించేది. కాలవగట్లమీద చెట్లకొమ్మలు నదిలోనికి వంగి తొంగి చూస్తూన్నట్లుండేవి. మీదనుంచి రకరకాల పక్షులు వలయాలు చుట్టి చిత్రవిచిత్రంగా తిరుగుతూ ఆడుకుంటూంటే వాటిని చూస్తూ, కదిలే మబ్బుల గుంపుల్ని చూపులతో వెంటాడుతూ గంటల తరబడి నీళ్లలో వుండిపోయేవాళ్ళం పెద్దాళ్లొచ్చి కేకవేసే వరకూ.

ఇప్పుడేం వుంది జీవితంలో తల్చుకునేందుకు, తల్చుకుని గర్వపడేందుకు? ప్రకృతితో చెలిమి చేసేందుకు? ఆ నేస్తాలులేరు, ఆ వయసూ మళ్ళీరాదు. అప్పుడు మొగ్గ తొడిగిన కోర్కెలూ ఆశలూ అన్నీ ఆ నీళ్ళల్లోనే ఎటో కొట్టుకొనిపోయాయి. నిన్నటి పూజా పుష్పాలలాగా. పంపుతిప్పితే బర్రుమని మొహంమీద చిందే నీళ్ళని చూసి బాయిలర్నీ బొగ్గుల కుంపటినీ చూసి గర్వపడేందుకు ఏముంది? తోటలో చెట్లు తోటల్లోనే వున్నాయి. చెట్లమీద పక్షులు వాటి కిలకిలలు, ఆరుబయట బంగారంలా పరుచుకునే ఎండ, చిన్నచిన్న వాగులూ వాగుల్లో ఆ గులకరాళ్ళూ, మింటను కవ్వించే నవ్వించే మబ్బు కన్యలూ అంతా ఏటో చెప్పకుండా వెళ్ళిపోయారు. వారపత్రికల పుటల్లో కాని, సినిమాల్లో కాని, వంటింటి పొగలోకాని, మనీపర్స్‌లో ఆఖరికి మకిలి పట్టిన నిలువుటద్దంలో కాని ఆగి ఒక క్షణం నిలబడి తేరిపారజూస్తే కనిపించేది మాసిపోయిన జీవితమే కదా! నదులు, కాలవలూ, చెట్లూ, పడవలూ, పొలంగట్లూ, తోటలూ, దొడ్లు, వీట్ల మధ్య పెరిగిన అమ్మాయిలకి పార్కుల్లో ప్రకృతి సౌందర్యాన్ని జూలో జంతువుల్నీ, సినిమాల్లో వనదేవతల్నీ చూసి మురిసి పోవాలంటే ఆత్మహత్య చేసుకున్నట్లు వుండదూ? సంతోషాన్ని చెంగున మూటకట్టుకుని తిరిగే ఆడపిల్లలకి నల్లకళ్ళద్దాల నీలినీడలూ, ఎత్తు మడమలజోళ్ళు ఏమి ఆనందాన్నివ్వగలవు? జీవితం నుంచి సంతోషాన్ని సంగ్రహించే శక్తి యిప్పటి ఆడపిల్లలకు ఎక్కడుంది? నేచర్ నుంచి విడగొట్టుకున్నాక పల్లెటూరి అమ్మాయిలు అన్నీ పోగొట్టుకున్నారు. నవనాగరికత సోఫిస్టికేషన్ వచ్చి మన కళ్ళకు పొరల్ని కమ్మివేసింది. మనకు దేనికైనా టైంలేదు. వంట్లో ఓపికంత కంటేలేదు. ఈ మధ్యన తల త్రిప్పకుండా గోస్తనది మీంచి బస్సుల్లో ఎన్నిమాట్లు ప్రయాణం చేయలేదు? బస్సు రేపే దుమ్ములోనే గతంకూడా కలిసిపోయింది.

మా మ్యారేజ్‌కాకముందు, అనగనగా –ఒకానొకప్పుడు వన్సపానె టైమ్ మావారోసారొచ్చి (అప్పుడు మీ వారే మావారు కాదులెండి) నన్ను తణుకు తీసికెళ్ళారు. అప్పుడు పడవ, బస్సులుండేవి. బస్సుకి బాడీ రవికా వుండేవికావు. సంతర్రోజుల్లో చింతపండు బుట్టలూ బెల్లం బుట్టలూ కుక్కినట్లు కుక్కేవారు ప్యాసింజర్లని, రవిక తొడుక్కోని అప్పలమ్మలాటి బస్సులో మా వూర్నించి తణుకు వచ్చేం. అప్పుడు యుద్ధం కదా (యుద్ధం ఎవరెవరికి ఎందుకు జరుగుతోందో నాకు తెలీదు) బస్సుకండక్టర్‌కి మమ్మల్నిద్దర్నీ జాగ్రత్తగా చూడమనీ తణుకులో దింపెయ్యమనీ మా ఫాదర్ బస్సు వెనకాల పరిగెత్తుతూ మరీ మరీ చెప్పారు. మెళ్ళో గొలుసూ తల్లో చామంతిబిళ్లా జాగ్రత్త జాగ్రత్త అని అమ్మ బస్సులోకి వినపడేలా కేకవేసింది. అది బొగ్గు బస్సు – బొగ్గుబస్సులో బొగ్గుబస్తాల పక్కసీట్లో మా కాబోయే కళ్యాణ దంపతుల్ని బస్సు వాడు ఒకరి వళ్లో ఒకరు కూర్చునేలా ఏర్పాటు చేశాడు. అరేంజి మెంటంతా నైసుగా లౌలీగానే వుంది కాని ఆ బొగ్గు బస్సులోంచి మేం దిగినపుడు మా అత్తయ్య మమ్మల్ని చూసి ఆశ్చర్యపడిపోయి ముక్కున వేలేసుకుంది. మూడు తలంట్లయాక కానీ నా అసలురంగు బయట పడలేదు, మా వారప్పుడు ఫిప్తుఫారం చదువుతున్నారు. కెమిస్ట్రీ సబ్జక్టు – నాలుగడుగుల తొమ్మి దంగుళాల మహా పురుషుడు. నేనేమోఫోర్ ఫీటు టూ ఇంచస్. ఇప్పుడు మేమిద్దరం సేంహైటేననుకుంటా – అప్పుడు మావారు స్మాల్ బోయ్ విత్‌నిక్కర్స్ అండ్ హాఫ్ షర్ట్స్ – ఐయాం పరికీణీలు అండ్ వోణీస్ మా అత్తయ్యే ఒకరోజు వోణీ తెప్పించి నాచేత వేయించింది. అఫ్‌కోర్స్ అప్పుడు అందరూ నా వోణీ పుచ్చుకులాగడవే –నాకు విసుగొచ్చి పీకి అవతల పారేసి పోయి ఆడుకునే దాన్ని. స్మాల్‌గరల్ని కదా, ఫోర్ ఫీట్ టూ ఇంచసే కదా నాకెందుకు చెప్పండి అప్పర్‌క్లాత్ – తనకు ప్యాంట్ కుట్టించకుండా నాకు ఓణీ మా అత్తయ్య కొన్నందుకు మావారు కారమ్స్ అండ్ మిరియమ్స్ నూర్తూ ఉండేవారు. అప్పుడు టుమేరీ దిస్ బోయ్ ఆర్‌నాట్ టు మేరీ అనుకునేదాన్ని బొగ్గుబస్సులో తీరా వొళ్ళో కూచున్నాను కదా, పెళ్ళాడక పోతే మనకంటే అగ్లీదెవత్తో బావగార్ని పెళ్లాడేసిందంటే మనకు ఇన్సల్టు జరిగిపోదూ? గోస్తనదిలో మొగపిల్లల్తో చేరి యీతలు కొట్టినందుకు సడెన్‌గా బొగ్గు బస్సులో వచ్చిన మా ఫాదర్ యాంగ్రీ అగ్నిహోత్రుడయి టామరిండ్ బరికతో వీపుమీద కొట్టిన దెబ్బలు, వాటి తాలూకు మచ్చలు యింకా నా వీపు మీద అలాగే వున్నాయి. నేను నా వీపుమీద మచ్చలు చూపిస్తే మా వారు రోడ్డుమీద పరిగెత్తలేక స్కూల్నించి వస్తూ పడిపోయి డొక్కుపోయిన మోకాలిమీద మచ్చలు గడ్డంకింద మచ్చలు చూపిస్తారు. ఎలాగైనా శరీరానికి కలిగిన మచ్చలు మచ్చలే కదా – అవి జీవితాంతం వుండిపోతాయి అని చిన్నథీరీని పైకిలాగాను టోపీలోంచి పిల్లిని బైటకు లాగినట్లు. అప్పుడు గోస్తనదిలో ఈవలనుంచి ఆవలకు ఈదాలని ప్రయత్నించిన నేను ఇప్పుడీ జీవితం ఈదలేక పోతున్నాను. దీనికి ఆవలిగట్టు అనేది వుందా – వుంటే కనపడదేమీ? నేను ములిగీత్తున్నాను. మావారు బారీత యీత్తున్నారు. గోస్తనదిలా ప్రతి గుమ్మంవద్ద నిలబడి చిరునవ్వులు నవ్వుతూ పలకరిస్తూ మా జీవనయాత్ర వంకర టింకరగా, టింకర వంకరగా

సాగిపోతోంది. ఇప్పుడు నీళ్ళను చూస్తే నాకు భయం, ఎప్పుడైన స్నానానికి వెళ్ళినా (వెళ్ళను) మెట్లమీదే కూర్చునిచెంబుతో రెండు చెంబుల నీళ్ళు తలమీద పోసుకుని మళ్ళీ వచ్చి పంపుకింద కూర్చుంటాను. ఇప్పటికైనా బోధపడిందా – లేదూ మీదీ మట్టిబుర్రే నన్నమాట మావారిలాగ... అరుగో షటప్ గారొస్తున్నారు. (వేర్ ది మైండీజ్ వితవుట్ ఫియర్ అని చదువుతున్నాడు పెద్దపిల్లాడు) అవును వేర్‌ది మైండ్ ఈజ్....

# గృహస్థాశ్రమం

ఇల్లు కట్టడం డామ్ యిరిఖవోయ్ అంటారు మావారు. కట్టండి చూద్దాం అని మనం అంటె ఆ వెధవ సామెత ఒకటి అడ్డొస్తోందోయ్ అంటారు తప్పంతా సామెతదైనట్లూ మనంరడీగానే వున్నట్టు. మనంపైన ఇల్లు కట్టుకోవాలంటే కింద జాగా వుండాలా వద్దా? అదేం వినిపించుకోరు మా గురువుగారు. మేం ఇల్లు కట్టడం గురించి ఆలోచించి నప్పుడల్లా జాగా విషయం మర్చిపోతూ వుంటాం. ఆఫ్టరాల్ యిల్లు కట్టాలనే సంకల్పమే వుండాలిగాని జాగా వుంటేనేం లేకపోతేనేం? ఫస్ట్ సంకల్పం, మనో నిబ్బరం, గుండె దిటవు కావాలంటారు. ఇల్లు కట్టుకోక పోవటం వలన మాకు చాలా హారిబుల్‌గా వుంటో వుంటుంది అప్పుడప్పుడు. ఓ గోడని మేకు కొట్టుకోవాలని వుంటుందా వుండదా మీరే చెప్పండి. మనకి గోడలకి సున్నాలు వేయించాలి అని మనసు పుట్టినపుడు ఎవరి గోడలకు సున్నాలు వేస్తాంచెప్పండి. సున్నాలు వెయ్యాలంటే మనకి గోడలుండాలా అక్కర్లేదా? మనకి ఇల్లు అద్దెకివ్వాలనుంటుంది. అద్దె పెంచాలని వుంటుంది. ఓ యిల్లు కట్టుకోకుండా ఆసరదా ఎలా తీరుతుంది? దొడ్లో ఇసకపోయించాలనిపిస్తుంది. ఇసుక పోయిద్దా వంటే యిల్లూ దొడ్డి వుండాలా అక్కర్లేదా? ఓ తాకట్టు పెట్టాలన్నా అమ్మాలన్నా ముందు ఇల్లు వుండాలా అక్కర్లేదా – కొందరంటారు ఇల్లు కట్టుకోవాలనే కోరిక కలగటం పరమ ఫూలిష్షని. అద్దె కొంపల్లో వుంటం నాగరికతా ఇల్లు కట్టుకోవటం బార్బరస్నుట. పక్కింటి పాపాయిని ముద్దెట్టుకుని సంతోషించటం మంచిదా, మనవే అవరోన్ ప్రాడక్ట్ (ఇది మా స్వంత తయారీ) అని పాపాయికోసం పాపం చేయటం మంచిదా? ఇల్లు కట్టుకోవటం పుణ్యమో పాపమో అదలాగుణ్ణిండికాని మనం ఇల్లుకట్టుకోకపోతే మ్యునిసిపాలిటీ లెక్కల్లో కూడా మన పేరుండదు. మ్యునిసిపాలిటీ లెక్కల్లో కూడా మన పేరులేకపోయాక మనకెంత దిగులుగా వుంటుంది? బిల్లుకలక్టరు శుభలేఖలు పట్టుకొచ్చినట్లు నోటీసులు పట్టుకొచ్చి యివ్వటం ఇంటిపన్ను ఎప్పుడుకడతారా అని అడగటం కడతాంలేవోయ్ అని మనం అనటం వాడువెళ్లి మరి నలుగురిని వెంటేసుకు రావటం యిలాంటి చిల్లర సరదాలు మనకి ఇల్లులేకపోతే మన జన్మలో తీరవు. మనింట్లో దొంగలు పడ్డారనుకోండి.